## క్లుప్తంగా

### బీఆర్ఎస్‌కు నష్టం లేదు..



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

భద్రాచలం: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వర్గీయుల రాజీనామాతో భద్రాచలం నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు వచ్చిన నష్టమేమి లేదని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ అధ్యక్షుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ కేసీఆర్, కేటీఆర్ ఆదేశాల మేరకు ఈ నెల 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. అలాగే, 25వ తేదీన నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంలో ఉదయం 7 గంటలలోపు పార్టీ జెండాలను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. కాగా, వ్యక్తిగత కారణాలతో పార్టీని వీడిన వారితో జరిగే నష్టమేమి ఉండదని చెప్పారు. పార్టీలో గ్రూపులు లేవని కేవలం కేసీఆర్ గ్రూప్ మాత్రమే పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఇక దళితబంధు కోసం ఎవరికి డబ్బులు ఇచ్చి మోసపోవద్దని, పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని తెలిపారు. సమావేశంలో పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అరికెల తిరుపతిరావు, కె.కృష్ణమూర్తి, నాయకులు బోదబోయిన బుచ్చయ్య, తిప్పన సిద్ధులు, రాంబాబు, యశోద నగేశ్, శ్వేత, లలిత, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

### పొంగులేటి వితరణ



నగదు అందజేస్తున్న పొంగులేటి అనుచరులు

బూర్గంపాడు: రంజాన్ సందర్భంగా మండలంలోని 12 మసీద్‌లలో ఇఫ్తార్ విందులను నిర్వహించేందుకు ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వితరణ అందజేశారు. శుక్రవారం పొంగులేటి అనుచర వర్గం ముస్లిం మత పెద్దలకు రూ.1.20 లక్షలను ఇఫ్తార్ విందు కోసం అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఆవుల నాగిరెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షులు పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, లక్ష్మీపురం ఉపసర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ముస్లిం మతపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

### రంజాన్ తోఫా పంపిణీ

భద్రాచలంఅర్బన్: అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యాన నిరుపేద ముస్లింలకు శుక్రవారం రంజాన్ తోఫా అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు మస్తాన్ మాట్లాడుతూ నిరుపేద ముస్లింలు కూడా రంజాన్‌ను సంతోషంగా జరుపుకోవాలనే ఆలోచనతో తోఫా అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మస్తాన్, ఉస్మాన్, ఖలీల్, ఇమామ్, అలీ, సర్వర్, జానీ, సుభాని, రోషన్, బాజి, యాకూబ్, హైదర్, మున్నా, సాధిక్, బాబాజీ పాల్గొన్నారు.

### పేదలకు దుస్తులు, సామగ్రి వితరణ



దుస్తులు సామగ్రి పంపిణీ చేసిన దృశ్యం

చండ్రుగొండ: దివంగత ప్రభుత్వ నాయబ్‌ఖాజీ సూఫీ మహమ్మద్ అబ్దుల్‌హుసేన్ జ్ఞాపకార్థం ఆయన వారసులు రంజాన్ పురస్కరించుకుని పేద ముస్లింలకు శుక్రవారం దుస్తులు, పండుగ సామగ్రి పంపిణీ చేశారు. జెడ్పీటీసీ కొడకండ్ల వెంకటరెడ్డి, ఎస్ఐ గొల్లపల్లి విజయలక్ష్మి, ఎంపీటీసీ దార వెంకటేశ్వరరావు, మజీద్ కమిటీ అధ్యక్షులు యండీ షమీహుసేన్, ఖాజీ యండీ షబ్బీర్‌హుసేన్, రహీం, ఇమాం, యాకూబ్, ఫయాజ్‌హుసేన్, జహీర్‌హుసేన్, నాబీద్, జాహిద్, ముజమ్మీల్, ఆసీఫ్ పాల్గొన్నారు.

### ముస్లింలకు ఇఫ్తార్ విందు



బూర్గంపాడు: సారపాకలోని పెద్ద మసీద్‌లో శుక్రవారం ముస్లింలకు స్థానిక ప్రజాప్రతినిధులు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. మైనార్టీ సెల్ జనరల్ సెక్రటరీ గుల్‌మహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శ్రీలత, బిక్కసాని శ్రీనివాసరావు, పొడియం ముత్యాలమ్మ, రమణారెడ్డి, జగదీశ్, సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్, ఖాదర్, నరేందర్ పాల్గొన్నారు.

**అశ్వాపురంలో...**

అశ్వాపురం: మండల కేంద్రంలోని జామా మసీదులో ముస్లింలకు శుక్రవారం ఇఫ్తార్ విందు ఏర్పాటుచేశారు. ఈ విందులో ఎంపీపీ ముత్తినేని సుజాతతో పాటు ముస్లింలు, మత పెద్దలు, నాయకులు ఓరుగంటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య తెలంగాణే లక్ష్యం..

- ప్రభుత్వ విప్ రేగా కాంతారావు
- పలు గ్రామాల్లో పర్యటన



రామానుజవరంలో సింగరేణి కళావేదికను ప్రారంభిస్తున్న విప్ కాంతారావు, జీఎం రామచందర్

మణుగూరురూరల్: ఆరోగ్యవంతమైన తెలంగాణ సాధనే లక్ష్యంగా సీఎం కేసీఆర్ ప్రభుత్వం కృషి చేస్తోందని పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. మండలంలోని తిర్లాపురంలో రూ.16 లక్షలతో నిర్మించిన పల్లె దవాఖానా భవనాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్య, ఆరోగ్య రంగాలకు పెద్దపీట వేస్తోందని, రూ.కోట్లాది నిధులు కేటాయిస్తోందని చెప్పారు. ప్రజలకు వైద్యాన్ని చేరువ చేసేందుకు బస్తీ దవాఖానాలు, పల్లె దవాఖానాలను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. అనంతరం రామానుజవరంలో గోదావరి పుష్కరఘాట్ వద్ద సింగరేణి ఆధ్వర్యాన రూ.44 లక్షలతో నిర్మించిన శ్రీరస్తు సింగరేణి కళావేదిక హాల్‌ను విప్ కాంతారావు, ఏరియా జీఎం దుర్గం రామచందర్ ప్రారంభించారు. కార్యక్రమాల్లో మణుగూరు ఎంపీపీ కారం విజయకుమారి, జెడ్పీటీసీ పోశం నర్సింహారావు, సర్పంచ్‌లు కొమరం జంపేశ్వరి, బచ్చల భారతి, బాడిశ సతీశ్, పీఏసీఎస్ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, ఎంపీడీఓ వీరబాబు, పీహెచ్‌సీ వైద్యాధికారి శివకుమార్, సింగరేణి అధికారులు, నాయకులు వెంకటేశ్వర్లు, ఎస్.రమేశ్, ప్రభాకర్‌రావు, ముత్యం బాబు, అడపా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

**అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

మండలంలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు విప్ కాంతారావు శంకుస్థాపన చేశారు. ముత్యాలమ్మనగర్ గ్రామపంచాయతీ కొత్త ఆర్అండ్ఆర్ కాలనీలో రూ.7.30 కోట్ల నిధులతో నిర్మించనున్న డ్రెయినేజీలు, సీసీ రోడ్లు, సమితి సింగారం గ్రామపంచాయతీలోని రాజీవ్‌గాంధీనగర్‌లో రూ.1.20 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్లు, రామానుజవరంలో రూ.9.21 కోట్లతో నిర్మించనున్న డబుల్ బెడ్ రూం ఇళ్లకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఇక మండలంలోని గుట్టమల్లారం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో రూ.2.70 కోట్లతో నిర్మించనున్న డార్మెటరీ బ్లాక్ నిర్మాణ పనులను కూడా విప్ కాంతారావు ప్రారంభించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎ.పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**కరకగూడెంలో..**

కరకగూడెం: మండలంలోని రేగళ్ల పంచాయతీ పరిధిలోని పడితాపురం గ్రామం వద్ద సుమారు రూ.3 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న హైలెవెల్ బ్రిడ్జి పనులను శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ గడువులోగా పనులు పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. భట్టుపల్లి మినీ స్టేడియం నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాద బాధితులకు చేయూత



దమ్మపేట: బాధితులకు దుస్తులు, వంటసామగ్రి అందజేస్తున్న వాసవీక్లబ్ సభ్యులు




భద్రాచలంఅర్బన్: రాజుకు నిత్యావసరాలు అందిస్తున్న దృశ్యం



అశ్వాపురం: నగదు అందిస్తున్న ట్రస్ట్ బాధ్యులు

దమ్మపేట: ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన రెండు కుటుంబాలకు వాసవీక్లబ్ బాధ్యులు శుక్రవారం నిత్యావసర సరుకులు, వంట పాత్రలు, దుస్తులు అందజేశారు. మండలంలోని రంగువారిగూడెంలో బుధవారం జరిగిన అగ్ని ప్రమాద బాధితులకు అవసరమైన వస్తువులను వారు అందజేసి మాట్లాడారు. వాసవీక్లబ్ రాష్ట్ర కార్యదర్శి దారా మల్లికార్జున్‌రావు, పసుమర్తి సత్యనారాయణతో పాటు పసుమర్తి రామభద్రం, బచ్చు రవి, భీమవరపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**సామాజిక కార్యకర్తకు..**

భద్రాచలంఅర్బన్: జిల్లాకు చెందిన సామాజిక కార్యకర్త గుమ్మడి రాజు కొంతకాలంగా రక్తహీనతతో బాధపడుతూ నడవలేని స్థితికి చేరుకోగా ప్రేరణ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శరత్ సుదర్శి చేయూతనిచ్చారు. అమెరికాకు చెందిన సహ హృదయా ఫౌండేషన్ బాధ్యురాలు తాడివాక బిందు సౌజన్యంతో రాజు కుటుంబానికి 50 కేజీల బియ్యం, ఇతర సరుకులు అందజేశారు.

**విశ్రాంత ఉద్యోగుల సేవా ట్రస్ట్ ఆధ్వర్యాన..**

అశ్వాపురం: విశ్రాంత ఉద్యోగుల సంఘం మణుగూరు యూనిట్ శాశ్వత సభ్యురాలు జొన్నలడగ్గ ఎల్లమ్మ (82) అనారోగ్యంతో గోపాలపురంలో శుక్రవారం మృతి చెందింది. దహన సంస్కారాల కోసం ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం సేవా ట్రస్ట్ బాధ్యులు రూ.5 వేలు అందజేశారు. ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు రాయల సత్యనారాయణ, చైర్మన్ డి.శ్రీనివాస్‌తో పాటు డీవీపీ ప్రసాద్, సత్యం, శంకరయ్య, శాంతకుమారి, లూసి నాగమణి పాల్గొన్నారు.

## 'సృజన కిరణం' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జల్లిపల్లి శ్రీరామమూర్తి

అశ్వారావుపేట: అశ్వారావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల రచనలతో వెలువడుతున్న «సృజనకిరణం»పుస్తకాన్ని ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి శుక్రవారం ఆవిష్కరించారు. పాఠశాల హెచ్ఎం నర్సింహారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడుతూ.. సీఆర్పీ ప్రభాకరాచార్యులు ఈ పుస్తకానికి సంపాదకత్వం వహించి విద్యార్థులకు రచనపై ఆసక్తిని కలిగించి వారిలో సృజనాత్మకతను వెలికితీయడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ కార్యదర్శి రామినేని రాంప్రసాద్, ఉపాధ్యాయులు రాంబాబు, టీఆర్ఎస్ నాయకులు మందపాటి రాజమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఫీజుల పెంపును నిరసిస్తూ ఆందోళన



ఆందోళన చేస్తున్న నాయకులు, కార్మికులు

బూర్గంపాడు: ఐటీసీ అనుబంధ భద్రాచలం పబ్లిక్ స్కూల్ ఫీజులను భారీగా పెంచటాన్ని నిరసిస్తూ ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఐటీసీ పీఎస్‌పీడీ అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయం వద్ద ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోనె రామారావు, యారం పిచ్చిరెడ్డి మాట్లాడుతూ.. ఐటీసీ యాజమాన్యం ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తోందని ఆరోపించారు. ఇంకా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం 30 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఐటీసీ పీఎస్‌పీడీ యాజమాన్యానికి అందజేశారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు పాల్గొన్నారు.

## గిరిజనేతరుల పెత్తనం ఏంటి?



మాట్లాడుతున్న సొందె మల్లూరు

దుమ్ముగూడెం: మండలంలోని ఇసుక సొసైటీలపై గిరిజనేతరుల పెత్తనం ఏంటని ఏఎస్పీ డివిజన్ అధ్యక్షుడు సొందె మల్లూరు ప్రశ్నించారు. శుక్రవారం మండలంలోని సీతానాగారం గ్రామంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో కారం నవీన్ అధ్యక్షతన ఏర్పాటైన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలం డివిజన్ పరిధిలో ఇసుక సొసైటీలు ఆదివాసీలవా? లేక గిరిజనేతరులవా? సమాధానం చెప్పాలని అధికారులను ప్రశ్నించారు. తూరుబాకలో ఎమ్మెల్యే అనుచరులు.. గిరిజనేతరులు అక్కడి సొసైటీపై పెత్తనం చెలాయిస్తున్నారని ఆరోపించారు. ఆదివాసీ నిరుద్యోగులను ఇసుక సొసైటీ కమిటీ సభ్యులుగా నియమించాలని కోరారు. కార్యక్రమంలో కారం మురళి, నరేశ్, వీరయ్య, సమ్మయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో హోమియో వైద్యశిబిరం



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని తాతగుడి సెంటర్‌లో ఉన్న ఎంపీపీఎస్‌లో శుక్రవారం హోమియో వైద్యాధికారి బి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. వేసవిలో వచ్చే వడదెబ్బ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పలువురు విద్యార్థులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.పాపయ్య, ఉపాధ్యాయులు లక్ష్మీప్రసన్న, శ్రీనివాసరావు, విక్టోరియ, జ్యోతి, వైద్య సిబ్బంది రత్నావళి, విజయ, కుమార్ పాల్గొన్నారు.

### ఏటీఎం మార్చి నగదు స్వాహా

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఏఎస్ఆర్ కాలనీకి చెందిన శేఖర్ బ్యాంకు ఖాతా నుంచి రూ.87వేలను గుర్తు తెలియని వ్యక్తి స్వాహా చేశారు. గతనెల 28న శేఖర్ అంబేద్కర్ సెంటర్‌ని ఓ ఏటీఎం కేంద్రానికి వెళ్లాడు. అక్కడ ఉన్న వ్యక్తి మాటల్లో పెట్టి కార్డు మార్చడమే కాక పిన్ తెలుసుకుని వెళ్లిపోయాడు. అతర్వాత శేఖర్ అకౌంట్ నుంచి సుమారు రూ.87వేలు డ్రా చేయడంతో శుక్రవారం ఆయన చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

**పేకాటరాయుళ్ల అరెస్టు**

పట్టణంలోని సూపర్‌బజార్ వీధిలో పేకాట ఆడుతున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పక్కా సమాచారంతో తనిఖీ చేయగా ఐదుగురు పట్టుబడడంతో రూ.27,310 స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

**అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై ఫిర్యాదు**

దుమ్ముగూడెం: భద్రాచలం ఎమ్మెల్యే పోదెం వీరయ్యపై సోషల్ మీడియా వేదికగా అనుచిత వ్యాఖ్యలు చేసిన మండలంలోని తూరుబాకకు బీఆర్ఎస్ కార్యకర్త బొల్లి శేఖర్‌పై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లంకా శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం సీఐ దోమల రమేశ్‌కు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యేపై విమర్శలు చేసిన శేఖర్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. నాయకులు కోడి చంటి, ఉబ్బ బాలకృష్ణ, సర్పంచ్ కట్టాం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### మలేరియా సర్వే

మణుగూరురూరల్: మండలంలోని వలస ఆదివాసీ గొత్తికోయ గ్రామమైన రేగులగండిలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం అసింప్టోమిక్ జ్వర సర్వేను నిర్వహించారు. సర్వేలో భాగంగా గ్రామానికి చెందిన 149 మంది రక్త నమూనాలను సేకరించి మలేరియా నిర్ధారణ పరీక్షలు చేయగా ఏ ఒక్కరికీ సోకలేదని తేలింది. జానకి, అరుణ్‌బాబు, రాంప్రసాద్, ఉమేశ్, లక్ష్మి, ప్రమీల, పగిడమ్మ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

### సీపీఆర్‌పై అవగాహన అవసరం



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

అన్నపురెడ్డిపల్లి: వయస్సుతో నిమిత్తం లేకుండా ఇటీవల పలువురు గుండెజబ్బుల బారిన పడుతున్నందున సీపీఆర్ విధానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండల వైద్యాధికారి ప్రియాంక అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం అవగాహన సదస్సు ఏర్పాటుచేయగా, ఆమె సీపీఆర్ విధానంపై అవగాహన కల్పించి మాట్లాడారు. తహసీల్దార్ భద్రకాళి, ఏఎస్ఐ పుల్లారావు వివిధ శాఖల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

### క్రీడలతో మానసికోల్లాసం..

దుమ్ముగూడెం: క్రీడాపోటీలు మానసికోల్లాసాన్ని కలగజేస్తాయని, క్రీడలతో స్నేహసంబంధాలు మెరుగుపడతాయని జెడ్పీటీసీ సభ్యురాలు తెల్లం సీతమ్మ అన్నారు. శుక్రవారం మండలంలోని పెదనల్లబల్లి గ్రామంలో కింగ్స్ యూత్ నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ఆమె ప్రారంభించారు. కుంజా శ్రీను, ఉబ్బ వేణు, మట్టా సోమయ్య, మడకం భూపతి రావు, ఇర్ప రాజు, కణితి సమ్మయ్య, పాయం రాంబాబు, మట్టా శ్రీను, మట్టా రాంబాబు, వీర్రాజు, కృష్ణ, వెంకటేశ్ పాల్గొన్నారు.

### కబ్జాలకు వ్యతిరేకంగా పోరాడితే పీడీయాక్ట్‌లా?

మణుగూరుటౌన్: మణుగూరు మండలంలోని ఆదివాసీల భూములు కబ్జా చేయడాన్ని వ్యతిరేకిస్తూ బాధితులకు బాసటగా నిలిచిన బీఎస్పీ పినపాక నియోజకవర్గ ఇన్‌చార్జ్ అలెం కోటిపై పీడీయాక్టు కేసు నమోదు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఇర్పా రవికుమార్ అన్నారు. శుక్రవారం మణుగూరులోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీక మల్లేశ్ పాల్గొన్నారు.

**న్యాయం కోసం పోరాడితే..**

బూర్గంపాడు: ఆదివాసీ భూములను కబ్జా చేసిన వారికి వ్యతిరేకంగా న్యాయం కోసం పోరాడుతున్న బీఎస్పీ పినపాక నియోజకవర్గ ఇన్‌చార్జ్ అలెం కోటిపై పీడీయాక్ట్ కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కేవీ రమణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

### దాన ధర్మ ట్రస్ట్ వితరణ

మణుగూరుటౌన్: మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని శివలింగాపురం ప్రాంతానికి చెందిన నిరుపేద యువకుడు జినుగు సంపద్ (29) వడదెబ్బతో మృతి చెందడంతో ఆ కుటుంబానికి దహన సంస్కారాల కోసం శుక్రవారం ధాన ధర్మ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.5 వేలు వితరణగా అందజేశారు. గంటా రాధ పాల్గొన్నారు.

### కరపత్రాల విడుదల

భద్రాచలంఅర్బన్: తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర మూడో మహాసభలు మే 5, 6న భద్రాచలంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు భద్రాచలం మాజీ ఎంపీ మీడియం బాబూరావు, పాయం రవివర్మ శుక్రవారం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సున్నం గంగా, రాష్ట్ర కమిటీ సభ్యులు సోయం జోగారావు, జిల్లా సహాయ కార్యదర్శి కుంజా శ్రీను, జిల్లా కమిటీ సభ్యులు కోర్స రవి పాల్గొన్నారు.

## పిల్లల వార్డులో ఎన్‌క్వాస్ బృందం



రికార్డులను పరిశీలిస్తున్న బృందం సభ్యులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఏరియా ఆస్పత్రిని శుక్రవారం ఎన్‌క్వాస్ బృందం సందర్శించింది. రెండురోజుల పరిశీలనలో భాగంగా మొదటి రోజు ఆస్పత్రిలోని నాలుగు చిన్నపిల్లల వార్డులను సభ్యులు సందర్శించి.. రికార్డులను పరిశీలించారు. చిన్నారులకు అందుతున్న వైద్యంపై తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. వార్డుల నిర్వహణలో కొన్ని లోటుపాట్లు ఉన్నాయని, వాటిని సరిదిద్దుకుంటే చిన్న పిల్లలకు మెరుగైన వైద్యం అందించవచ్చని వారు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌క్వాస్ బృందం సభ్యులు డాక్టర్ జనేయికాస్పెట్, సంజులత, భార్గవ్‌తోపాటు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ, ఆర్ఎంఓ రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చెవిలో పూలతో వీఓఏల నిరసన

అశ్వాపురం: మండలంలోని వీఓఏలు శుక్రవారం చెవిలో పూలతో దీక్షలో కూర్చొని నిరసన తెలిపారు. వీఓఏల దీక్షలకు మాదిగ జేఏసీ జిల్లా నాయకుడు దేపంగి వెంకటరమణ సంఘీభావం తెలిపారు. దీక్షలో వీఓఏలు అరుణ, సత్యవాణి, వేల్పుల కవిత, తూము సుమలత, రాజు, శ్రీలత, రమాదేవి, హైమావతి, ధనలక్ష్మి, సుగుణ, స్వరూప, లత, మండలంలోని వీఓఏలు పాల్గొన్నారు.

**మణుగూరులో..**

మణుగూరురూరల్: వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం ఐదోరోజుకు చేరింది. శిబిరాన్ని పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, వైస్ఎంపీపీ కరివేద వెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్ పుచ్చకాయల శంకర్ సందర్శించి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సులోచన, శ్రీనుగోపాల్, రమేష్, ప్రవంతి, రాము, ధనలక్ష్మి, లలిత, అరుణ, చాందిని, వీఓఏలు పాల్గొన్నారు.

**ములకలపల్లిలో..**

ములకలపల్లి: వీఓఏల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని ఆ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు నరాటి ప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం జరిగిన సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వీఓఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. దాసం కనకలక్ష్మి, ఏలూరు దుర్గ, ఎస్కే షఫియా, లక్ష్మీకుమారి, పెద్దులమ్మ, సత్యనారాయణ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఓసీ పనుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా దీక్ష



దీక్షలో పాల్గొన్న ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు

మణుగూరుటౌన్: మణుగూరు ఏరియా పీకేఓసీ-2లో సర్ఫేస్ మైనర్, డ్రిల్ పనులను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యాన శుక్రవారం దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో సీపీఐ నాయకుడు బి.అయోధ్య, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై.రాంగోపాల్ మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లో పనులను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించొద్దని డిమాండ్ చేశారు. సింగరేణిలో పది మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి పీకేఓసీ-2 రికార్డు సృష్టించడానికి కార్మికుల కృషే కారణమని తెలిపారు. అయినప్పటికీ ప్రైవేట్‌కు అప్పగించాలని నిర్ణయించడం సరికాదన్నారు. దీక్షలో నాయకులు బి.వీరస్వామి, ఎంవీ.రాంనర్సయ్య, శివయ్య, సుబాని, నాగరాజు, ఈశ్వర్, మల్లేశ్, సుధాకర్, శ్రీనివాసరావు, గంగాధర్‌రావు, రవి, అక్కి నర్సింహారావు, సర్వర్, యోహాన్, సందీప్, నరేందర్, సారయ్య, రాజేశ్వరరావు, శంకర్‌రావు, అబ్రహం, అలీ, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల మేలు కోసమే కొనుగోలు కేంద్రాలు



బూర్గంపాడు: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ శ్రీలత తదితరులు

బూర్గంపాడు: రైతులకు మేలు చేసేందుకే రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తోందని జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత అన్నారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం సంజీవరెడ్డిపాలెం గ్రామంలో యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. రైతులు ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బిక్కసాని శ్రీనివాసరావు, గోపిరెడ్డి రమణారెడ్డి, జలగం జగదీశ్, జక్కం సుబ్రహ్మణ్యం, గొనెల నాని, మేడం లక్ష్మీనారాయణ రెడ్డి, కుందూరు పెద్దిరెడ్డి, సాబీర్‌పాషా, సాధిక్, వల్లూరిపల్లి వంశీకృష్ణ, కొనకంచి శ్రీనివాస్, జక్కం సర్వేశ్వరరావు, సోహైల్‌పాషా, సీతంశ ప్రసాద్, ఉమర్, తిరుపతిరెడ్డి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

**ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం**

అశ్వాపురం: నెల్లిపాక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో యాసంగి సీజన్‌కు సంబంధించి మండలంలోని మొండికుంట, మల్లెలమడుగు, నెల్లిపాక గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. వాటిని శుక్రవారం సంఘం అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. రైతులు 17 శాతం లోపు తేమ ఉండేలా ధాన్యం ఆరబెట్టి తాలు, మట్టి లేకుండా శుభ్రం చేసి వ్యవసాయ అధికారి ద్వారా టోకెన్ పొంది ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ముస్కు ధనలక్ష్మి, సుధాకర్‌రెడ్డి, కాసరబాద సందీప్, కోడి వెంకన్న, రైతులు పాల్గొన్నారు.

## నిర్వాసితులకు పునరావాసం కల్పించాలి

భద్రాచలంఅర్బన్: పోలవరం బ్యాక్ వాటర్‌తో భద్రాచలం, బూర్గంపాడు మండలాల్లోని పలు గ్రామాలు ముంపునకు గురికానున్నందున పునరావాసం కల్పించాలని సీపీఎం నాయకుడు మచ్చా వెంకటేశ్వర్లు శుక్రవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. వివిధ మండలాల్లో గ్రామాల్లోని సాగు భూములు, ఇళ్లు కూడా మునిగిపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. భూములకు పరిహారం చెల్లించడమే కాక ప్రజలకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కల్పించాలని కోరారు. అంతేకాకుండా ఎటపాక నుంచి భద్రాచలంలోని సుభాష్ నగర్‌కాలనీ వరకు గోదావరి వెంట కరకట్టను పటిష్టం చేయాలని డిమాండ్ చేశారు.